ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ విడుదల చేయాలి



రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబ మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లో మౌలిక వసతులు కల్పించాలని, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, గురుకులాల్లో నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకుండా విద్యార్థులను ఇబ్బందులను గురి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గణేష్, సైదులు, ధరణి, సుమన్, రంజిత్ పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: విగ్రహప్రతిష్ఠాపనోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. మూడు రోజులుగా కొనసాగుతున్న శివ నందీశ్వర, పోచమ్మ, నాగ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు శుక్రవారంతో సమాప్తం అయ్యాయి. మండల పరిధి మాణిక్యమ్మగూడలోని శివాలయంలో ఉదయం అభిషేకం, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, పాత కాల పూజలు, హోమాలు తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం నందీశ్వర, పోచమ్మ, నాగదేవత యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, అష్ట బలి, మహాబలి, పూర్ణాహుతి, నేత్రోన్మీలనం, విశేష అలంకారం దర్శనం, రుత్విక్ సన్మానం పలు రకాల పూజ లు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం బోనాలు చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి, మాణిక్యమ్మగూడ మాజీ సర్పంచ్ చంద్రయ్య గౌడ్, మాణిక్యమ్మ గూడ గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, ప్రధా న కార్యదర్శి తిరుతిరెడ్డి, దయాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయంలో స్పీకర్ పూజలు


అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

ఉప్పల్: ఉప్పల్ ఎన్‌జీఆర్ గేట్ వద్ద గల అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవానికి హాజరైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఆయల కమిటీ, దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటి మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, కార్పొరేటర్ కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, ఎండోమెంట్ ఆర్‌జేడీ రామకృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఆలయ ఈవో భాగ్యలక్ష్మీ, శ్రీకాంత్, ప్రధాన అర్చకులు రవీందర్ శర్మ, సంతోష్, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉప్పల్ రామాలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం రామజన్మ నక్షత్రం సందర్భంగా నిర్వహించిన శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శారదానగర్, గంగా హాస్పిటల్, న్యూ మారుతీనగర్, బీరప్ప టెంపుల్ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉ.11 నుంచి 11.30 గం వరకు, 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలో ఉ.11 నుంచి మ.1 గంట వరకు, 11కేవీ న్యూ నాగోలు, చాణక్యపురి ఫీడర్ల పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ గణేశ్ నగర్ ఫీడర్ కింద ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు, 11కేవీ శివపురికాలని ఫీడర్ పరిధి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11కేవీ తట్టిఅన్నారం ఫీడర్ కింద మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరా ఉండదని రామకృష్ణ పేర్కొన్నారు.

మీర్‌పేట: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జనార్దన్‌రెడ్డి నగర్ ఫీడర్ పరిధి భూపేష్ గుప్తానగర్, గాయత్రినగర్, న్యూ గాయత్రినగర్, శ్రీధర్‌కాలని, బాలాజీనగర్, విజయదుర్గకాలని, వివేక్‌నగర్, బండి సత్తయ్యకాలని, హనుమాన్ నగర్, వేంకటేశ్వరకాలని, ల్లెలగూడ విలేజ్, 11కేవీ జయశ్రీకాలని ఫీడర్ కింద సీతాహోమ్స్, మీర్‌పేట మున్సిపల్ కార్యాలయం, సర్వోదయకాలని, ప్రగతి కాలని, సాయివిహార్‌నగర్, టీఆర్ఆర్ కళాశాల, ఎంఎల్ఆర్‌కాలని, తిరుమల ఎన్‌క్లేవ్, వినాయకనగర్ కాలనీల్లో ఉ.11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు.. భక్తుల బారులు


దర్శనానికి బారులు తీరిన భక్తులు

ప్రత్యేక అలంకరణలో అష్టలక్ష్మి అమ్మవారు

దిల్‌సుఖ్‌నగర్: దిల్‌సుఖ్‌నగర్‌లోని వివిధ ఆలయాల్లో శ్రావణమాస ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో శ్రావణమాస నాలుగో శుక్రవారం సందర్భంగా ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామికి అభిషేకం, అమ్మవారికి లక్ష పుష్పార్చన, అలంకరణ, అష్టలక్ష్మి శ్రీలక్ష్మీ నారాయణ స్వామివారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

సామూహిక కుంకుమార్చన..

మన్సూరాబాద్: శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయంలో అమ్మవారు హరిధసూత్ర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రమణమూర్తి, కేశవులు, మురళీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


కుంకుమార్చన చేస్తున్న మహిళలు



దారంతా చెత్త.. రాకపోకలెట్లా?


బాల్‌రెడ్డినగర్‌కాలనీలో..

ఎల్‌బీనగర్: కాలనీలు, బస్తీల్లో పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో పరిసరాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. సాహెబ్‌నగర్ నుంచి ఇంజాపూర్ వెళ్లే రోడ్డులో భారీగా పేరుకుపోయిన చెత్తలోంచి దుర్వాసనతో వస్తుండటంతో రాకపోకలు సాగించకలేక పోతున్నామని వాపోతున్నారు. ఇళ్ల వద్దకు వస్తున్న స్వచ్ఛ ఆటోలకే చెత్త ఇవ్వాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా కొందరి నిర్వాకంతో అందరికీ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాలి వీచినప్పుడు చెత్తాలోని కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు అటుగా వెళ్లే వాహనదారులపై పడి ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. వివిధ మాసం దుకాణాల నిర్వాహకులు సైతం ఇక్కడే వ్యర్థాల పారబోస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధులు పబలుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో..

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోనూ చెత్త పేరుకుపోతుందని స్థానికులు వాపోతున్నారు. వారాల తరబడి చెత్త నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయని భయాందోళనకు గురవుతున్నారు. బాల్‌రెడ్డినగర్‌కాలనీలో చెత్తను తరలించకపోవడంతో కుప్పలు, కుప్పలుగా పేరుకు పోయింది. గణేష్‌నగర్‌కాలనీలో భారీగా చెత్త పేరుకు పోవడంతో అటుగా రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు గణేశ్ ఉత్సవాల సన్నాహక సమావేశం

హస్తినాపురం: వినాయక పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వై.అశోక్‌రెడ్డి అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న గణేశ్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎఫ్‌సీఐకాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించే సమావేశానికి అందరూ హాజరవ్వాలన్నారు.

రేపు ఆత్మీయ హిందూ సమ్మేళనం

చైతన్యపురి: విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి ఉత్సవాల నేపథ్యంలో వివేకానంద జిల్లా వీవీనగర్ ప్రఖండ ఆధ్వర్యంలో ఆత్మీయ హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కొళ్లం మదుసూధన్ రెడ్డి, కార్యదర్శి కీర్తిగారి అనంతాచారి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సరూర్‌నగర్ చెరువు కట్టపై ఉన్న భవాని శంకర్ ఆలయంలో సమ్మేళనం ఉంటుందని అధిక సంఖ్యలో హిందూ బంధువులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ. 15, వంకాయ రూ. 28, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 13–28, కాకర రూ. 23, బీర రూ. 35, క్యాబేజి రూ. 15, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 50, దొండ రూ. 25–28, చిక్కుడు రూ. 60, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 38, దోస రూ. 15, సొర రూ. 11, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 49, చామగడ్డ రూ. 37.

ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

భారీ విగ్రహం.. ఇక్కడే నిమజ్జనం

నాగోలు బాలాజీనగరంలో తిరంగాయాత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 54 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించి ఇక్కడే నిమజ్జనం చేయనున్నట్లు అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు.

–సాక్షి, సిటీబ్యూరో



శివాలయ ముఖద్వారం ప్రారంభం


ముఖద్వారం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీ నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ సహిత శివాలయ ముఖద్వారాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహాగుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ముఖద్వారం ఏర్పాటు బృహత్ కార్యక్రమమని ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి సిద్ధేశ్వర్, కోశాధికారి అంజయ్య, స్థానికులు రాంగోపాల్, వినోద్‌యాదవ్, రుద్రారపు శంకర్, వేణుగోపాల్‌చారి, భాగ్యశ్రీ, రాంమోహన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళిక మార్పుతోనే దేశాభివృద్ధి

ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి


సభలో మాట్లాడుతున్న లింబాద్రి

చార్మినార్: పాఠ్య ప్రణాళికమార్పుతోనే దేశాభివృద్ధి అని, ఉపాధి కేంద్రకమైన పాఠ్య ప్రణాళికను సామాజిక శాస్త్రాల్లో ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యాపకులకు నిర్వహిస్తున్న ఆరు రోజుల ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచమంతా వేగంగా మారుతున్నపుడు విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు అనుగుణంగా మన పాఠ్యప్రణాళికలు మార్చుకోవాలన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలో అనేక కొత్త డిగ్రీ కోర్సులను పరిచయం చేశామని, అదే తరహాలో ఈ ఏడాది బీఏ పబ్లిక్ పాలసీ గవర్నెన్స్ అనే డిగ్రీని కొన్ని ప్రభుత్వ కాలేజీలలో ప్రవేశపెట్టామని అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆచార్య పార్థసారథి మాట్లాడుతూ..సివిల్ సర్వీస్ పరీక్షలో విద్యార్థులు ఎక్కువ మంది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ను ఐచ్ఛిక అంశంగా ఎంపిక చేసుకుంటున్నారని తెలిపారు. పబ్లిక్ పాలసీ గవర్నెన్స్ కోర్సును ప్రయోగాత్మకంగా సిటీ కళాశాలతో పాటు మరికొన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశపెట్టడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్, కన్వీనర్ డా.శంకర్, డా.విప్లవ దత్ శుక్లా, డా.యాదయ్య. డా.రవి కుమార్, డా.కృష్ణవేణి, డా.మల్లిక, డా.ఆది రమేశ్, డా.రవీంద్ర బాబు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

ఎన్‌ఆర్‌ఎల్‌ఎం అధికారుల బృందం


డ్వాక్రా సంఘాన్ని సందర్శించిన పొరుగు రాష్ట్రాల అధికారుల బృందం

మహేశ్వరం: మహిళా సంఘాల పనితీరు, ఆర్థికాభివృద్ధి బాగుందని జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ అధికారుల(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) బృందం కొనియాడింది. శుక్రవారం మండల పరిధి మొహబ్బత్‌నగర్ గ్రామంలోని మహిళా డ్వాక్రా సంఘాన్ని 9 రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఐఆర్‌డీ అధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మహిళా స్వయం సహకార సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణ, సంఘాలు ఏ విధంగా బలోపేతం అయ్యాయి తదితర వివరాలను సంఘం సభ్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొంది, జీవనోపాధి ఏర్పాటు చేసుకోవడాన్ని వారు అభినందించారు. వీరు చేపట్టిన కార్యక్రమాలను తమ రాష్ట్రాల్లో అమలు చేసుకుంటామని అధికారుల బృందం పేర్కొంది. కార్యక్రమంలో పంజాబ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ అధికారులు, ఎన్‌ఐఆర్‌డీ మేనేజర్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శైలజ, ఏపీఎం సత్యనారాయణ, వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఆర్‌ఎల్‌ఎం అధికారులు, మండల మహిళా సమఖ్య అధ్యక్షురాలు కవిత, వీఓఏలు జమున, లక్ష్మి, విజయలక్ష్మి పలువురు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ ఎస్‌హెచ్‌ఓగా వినోద్‌కుమార్



లింగోజిగూడ: ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా వినోద్‌కుమార్ శుక్రవారం బాధ్యతల తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన రామాంజనేయులును రాచకొండ సైబర్ క్రైం విభాగానికి బదిలీ కాగా ఆయన స్థానంలో రాచకొండ సీపీ కార్యాలయంలో వెయింటింగ్‌లో ఉన్న వినోద్‌కుమార్‌ను ఎల్‌బీనగర్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, స్టేషన్ పరిధిలోని కాలనీలలో నిరంతరం గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకారించాలని, ఎలాంటి సమస్య తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సన్మానం....



మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వినోద్‌కుమార్‌ను నాగోలు డివిజన్ పరిధి ఎరుకల నాంచారమ్మ డబుల్ బెడ్రూమ్ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు గండికోట భీమరాజు ఆధ్వర్యంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు భీమనపల్లి సిద్దు, బందేల సైదులు, లింగయ్య, నర్సింహా పాల్గొన్నారు.

నిరంతరం వైద్య సేవలు అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న హేమంత్

వనస్థలిపురం: రాష్ట్రవ్యాప్తంగా విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో 24 గంటలు వైద్యసేవలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ సూచించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిని సందర్శించి సూపరింటెండెంట్ డా.కృష్ణ, ఆర్‌ఎంఓ జయమాల, డా.నాగేంద్రతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వైద్యులు, మందులు, గదులు, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డా.త్రివేణి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్: ప్రపంచంలో అధిక సభ్యులు ఉన్న రాజకీయ పార్టీ బీజేపీ అని సభ్యత్వాలను మరింతా పెంచేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన నివాసంలో సభ్యత్వ నమోదుపై నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. డివిజన్‌లో నివాసాలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా వచ్చిన వారిలో ఎంతో మంది మోడీ అభిమానులు బీజేపీ కార్యకర్తలు ఉంటారని కాబట్టి కార్యకర్తలు కొత్తగా వచ్చిన వారిపై దృష్టి పెట్టాలన్నారు. గత ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా సేకరించిన వివరాల ఆధారంగా ఓటర్లను సభ్యులుగా చేర్చాలన్నారు.

మైనర్ బాలిక అపహరణ, లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికను అపహరించి వివాహం చేసుకుని, లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ సునితాబర్ల వివరాల ప్రకారం.. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో గుడిసెల్లో బాలిక(16) తన తల్లిదండ్రులతో కలిసి నివసించేది. బాలిక మహబూబ్‌నగర్‌లో 9వ తరగతి చదువుతుండగా ఆరోగ్యం క్షీణించడంతో ఇంటి దగ్గరే ఉంటుంది. మీర్‌ఖాన్‌పేట్ గ్రామంలో నివసించే శివాజీ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. పరిచయాన్ని ఆసరాగా తీసుకుని 2017, ఫిబ్రవరి 11న అర్ధరాత్రి బాలిక కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు రావడం గమనించిన శివాజీ బాలికకు మాయమాటలు చెప్పి సికింద్రాబాద్‌లోని ఓ అద్దె ఇంట్లో బంధించి మరుసటి రోజు గుడిలో వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడి, మూడ్రోజుల తర్వాత బాలికను తన ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి నుంచి అదృశ్యమైన తమ కూతురి గురించి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కందుకూరు పోలీసులు బాలిక కోసం గాలిస్తుండగా బాలిక తండ్రి 2017 ఫిబ్రవరి 15న తన కూతురిని తీసుకుని స్టేషన్‌కి వచ్చాడు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్షులను విచారించిన కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది.

హైడ్రాకు ఫిర్యాదులు

మీర్‌పేట: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన బండి నగేష్ శుక్రవారం హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సర్వే నం. 155లోని సర్కారు జాగను కొందరు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. హైడ్రా అధికారులు స్పందించి, ఆక్రమణదారుల నుంచి భూమిని రక్షించాలని కోరారు.